

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి రామాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నంగునూరు(సిద్దిపేట): నంగునూరులో..

ఆనందంగా అట్ల బతుకమ్మ

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా సాగుతున్నాయి. ఐదోజైన ఆదివారం అట్ల బతుకమ్మకు మహిళలు, యువతులు ఊరూరా తీరొక్క పూలతో పేర్చి భక్తితో కొలిచారు. ఆట, పాటలతో సందడి చేశారు. బియ్యంతో వేసిన అట్లు గౌరమ్మకు నైవేద్యంగా సమర్పించి, తర్వాత ముత్తైదువులకు వాయనంగా ఇచ్చారు. అనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో..

క్లుప్తంగా

పేదలకు వరం



చెక్కును అందజేస్తున్న హరీశ్‌రావు

మర్కూక్(గజ్వేల్): సీఎం సహాయనిధి పేదలకు వరం అని మాజీ ఎంపీపీ పాండుగౌడ్ అన్నారు. మండలంలోని పాములపర్తికి చెందిన పిట్ల సాయికిరణ్‌కు మంజూరైన రూ.43,500 సహాయనిధి చెక్కును ఆదివారం అందజేశారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ములుగు(గజ్వేల్): అర్హులైన పేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ములుగు మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన బాలెంక రాజుకు రూ.60వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అర్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ పథసంచలన్



పథసంచలన్ చేస్తున్న స్వయం సేవకులు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపించి 99 సంవత్సరాలు పూర్తయి 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం పట్టణ కేంద్రంలో పథసంచలన్ నిర్వహించారు. స్థానిక కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఆవరణ నుంచి ప్రారంభమైన ఈ కవాతు ఆదిశంకర మఠం వరకు కొనసాగింది. కార్యక్రమంలో దేశపతి అమోగ్, గోల్కొండ రాఘవులు, బొడుగం సిద్దారెడ్డి, స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయ సభ్యులతో రాజేశ్వర్‌రెడ్డి

నంగునూరు(సిద్దిపేట): పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తనవంతుగా సహాయం అందజేస్తామని ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. నర్మేటలో చేపట్టిన పెద్దమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి అయ్యే ఖర్చులను అందజేస్తానన్నారు. కార్యక్రమంలో బాలయ్య, లక్ష్మయ్య, శేఖర్, రాములు, బాలయ్య, రాజు, సురేశ్, అశోక్, శ్రీకాంత్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం



చండీ హోమం చేస్తున్న భక్తులు

నంగునూరు(సిద్దిపేట): అమ్మవారి అనుగ్రహంతో ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని చండీ హోమం నిర్వహించామని పూజారి రణధీరచార్యులు చెప్పారు. పాలమాకుల వేంకటేశ్వరాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదం అందజేసి, అన్న సంతర్పణ నిర్వహిచారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, రామానుజం, మల్లేశం, బుచ్చిరెడ్డి, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘వైకుంఠ’ ధామమే..

పార్కును తలపించేలా శ్మశానవాటిక

- ఎటు చూసినా పచ్చదనం
- త్వరలోనే అందుబాటులోకి..



శ్మశానవాటికలో పూలు, కొబ్బరి మొక్కలు



ముక్తిధామం చుట్టూ పెనవేసుకున్న మొక్కలు



అస్థికలు భద్రపర్చుకునే ప్రత్యేక గది

హుస్నాబాద్: పచ్చని చెట్లు, పూల మొక్కలు, ఆహ్లాదకరమైన వాతావరణంతో పార్కును తలపిస్తోంది స్థానిక శ్మశానవాటిక. దానిని పట్టణంలోని మినీ స్టేడియం వెనుకాల నూతనంగా రూ.30లక్షల వ్యయంతో నిర్మించారు. అంత్యక్రియలకు అన్ని సదుపాయాలు కల్పించారు. ఒకేసారి నాలుగు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు స్వర్గధామాలను ఏర్పాటు చేశారు. నీటి సదుపాయంతో పాటు మహిళలు, పురుషులకు వేర్వేరుగా స్నానపుగదులను నిర్మించారు. కర్మకాండ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. వర్షం వస్తే తడవకుండా ఉండేందుకు ప్రత్యేకమైన పొడవాటి గది, అస్థికలను భద్రపర్చుకునేందుకు ప్రత్యేక వసతి ఏర్పాటు చేశారు.

అతి తక్కువ రుసుములో..



ఇక్కడి పచ్చదనం చూస్తే మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు బాధను మర్చిపోయేలా శ్మశాన వాటికను తీర్చిదిద్దాం. అంతే కాదు అతి తక్కువ రుసుముతో దహన సంస్కారాలు చేసేలా నిర్ణయించాం. అంత్య క్రియలు నిర్వహించడానికి అవసరమైన సదుపాయాలను కల్పించాం. శ్మశానవాటికను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– రజిత, మున్సిపల్ చైర్ పర్సన్

పార్కు తరహాలో..

శ్మశానవాటిక లోనికి ప్రవేశించగానే పచ్చని తోరణాలు స్వాగతం పలుకుతాయి. నాలుగు దిక్కుల్లో సీసీ రోడ్లు, రోడ్లకు రెండు వైపులా రంగురంగుల పూలమొక్కలు, కొబ్బరిచెట్లు దర్శనమిస్తాయి. శివముక్తిని కల్పించే పెద్ద శంకరుడి విగ్రహం, ఖననంచేసే ముక్తిదామం చుట్టూ పచ్చటి పందిళ్లు పరిచినట్లుగా పచ్చదనంతో నింపారు. ప్రతిరోజు మొక్కలు, చెట్లకు నీరుపట్టి వాటికి జీవం పోస్తున్నారు.

చెరువుల వద్ద మహిళలకు ఇబ్బందులు

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని పలు చెరువుల వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు వచ్చిన మహిళలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొందరు అధికారులు ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేవిధంగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. చెరువుల వద్ద సరైన విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటు చేయలేదని, ఘాట్లను శుభ్రంగా ఉంచడంలో మునిసిపల్ పాలకవర్గం విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమైన మున్సిపల్ చైర్మన్ మంజుల నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్‌ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాశాద్, యువజన నాయకులు నజ్జు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదు కేంద్రాలు ప్రారంభం

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు



ప్రారంభమైన ఓటుహక్కు నమోదు కేంద్రం

గజ్వేల్: రానున్న మార్చిలో జరగనున్న కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గజ్వేల్‌లో ఆదివారం ఉచిత ఓటుహక్కు నమోదు కేంద్రాలను ప్రారంభించారు. ప్రసన్న హరికృష్ణ టీమ్ సభ్యులు మల్లికార్జున్, సాదిక్ పాషా, మధుబాబు తదితరులు ఈ కేంద్రాలను ప్రారంభించారు. అయ్యప్ప ఆలయం ఎదురుగా ఉన్న విద్యార్థి బుక్‌డిపో, సంగాపూర్ రోడ్డు వైపున ఉన్న గ్లోబల్ కంప్యూటర్ సెంటర్, పెంటాచారి ఆసుపత్రి వద్ద వెంకటేశ్వర కమ్యూనికేషన్ సెంటర్‌లోను ఈ అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. 2021లోపు డిగ్రీ పూర్తిచేసిన వారు తమ నవంబరు 6వ తేదీలోగా తమ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

నైపుణ్యంతో యువతకు మేలు


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నైపుణ్యంతో యువతకు మేలు కలుగుతుందని విశ్వకర్మ శిక్షకులు అనిల్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగుతున్న పీఎం విశ్వకర్మ యోజన కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీనివాసనగర్‌లో వారం రోజులుగా అందిస్తున్న శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. శిక్షకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సుంకోజి ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌చారి, బాలచారి, సురేశ్‌కుమార్, వెంకటేశం, సీతారాములు పాల్గొన్నారు.

‘కమ్యూనిటీ కాంటాక్ట్’తో సమస్యల గుర్తింపు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఉపేందర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ద్వారా సమస్యలను గుర్తించే అవకాశం ఉంటుందని టూటౌన్ సీఐ ఉపేందర్ అన్నారు. కేసీఆర్‌నగర్ డబుల్‌బెడ్రూం కాలనీలోని ప్రజలతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో సీఐ ఉపేందర్ మాట్లాడి వారి సమస్యల గురించి అడిగారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, నేరస్థులు వచ్చారా అని ఆరా తీశారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మర్కూక్(గజ్వేల్): గాయత్రి దేవిగా..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీమహాలక్ష్మి దేవిగా..



నంగునూరు(సిద్దిపేట): పూజలు చేస్తున్న మహిళలు, యువకులు



మద్దూరు(హుస్నాబాద్): కుంకుమార్చన చేస్తున్న మహిళలు



చిన్నకోడూరు(సిద్దిపేట): రామునిపట్లలో అమ్మవారి చెంత యూత్ సభ్యులు

జగజ్జననీ పాహిమాం..

దేవీ శరన్నవరాత్రోత్సవాలను జిల్లా వ్యాప్తంగా భక్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. ఆలయాలు, వాడవాడలా నెలకొల్పిన మండపాల వద్ద ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జగజ్జననీ పాహిమాం.. అంటూ ఆ జగన్మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ రకాల ప్రసాదాలను నైవేద్యాలుగా సమర్పించుకున్నారు.



గజ్వేల్‌రూరల్: ఆరు అంగులాల బతుకమ్మతో రామకోటి రామరాజు

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

శెట్టిపల్లి సత్తిరెడ్డి



మాట్లాడుతున్న సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్, నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పోసాన్‌పల్లి గ్రామశాఖ మహాసభను సత్తయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ దేశంలో పెరిగిన నిత్యావసరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ప్రధానమంత్రి మోదీ మాత్రం పాలన గాలికి వదిలేసి విదేశీ పర్యటనలు, విద్వేష ప్రసంగాలతో ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించకుండా ఆయిల్ కంపెనీలకు లాభం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. పంటలు కోతకు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పోసాన్‌పల్లి ప్రధాన రహదారికి రెండువైపులా డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. అనంతరం గ్రామ కార్యదర్శులుగా ప్రశాంత్, బాబును ఎంపిక చేశారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, బాలకిషన్, నరేందర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రెస్‌క్లబ్ 50యేళ్ల వేడుకలు

హుస్నాబాద్: టీయూడబ్ల్యూజే అనుబంధమైన హుస్నాబాద్ డివిజన్ ప్రెస్‌క్లబ్ 50యేళ్ల వేడుకలను త్వరలో నిర్వహించనున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తిరుపతి వెల్లడించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో భవన్‌లో ఆదివారం కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశా లపై తీర్మానంచేసి ఆమో దించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన కోహెడ మండలానికి చెందిన విలేకరి సురుకొంటి శ్రీనివాస్‌రెడ్డికి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు తిరుపతి మాట్లాడుతూ డివిజన్‌లో అర్హులైన ప్రతి విలేకరికి స్థలాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. డివిజన్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి చల్లా రాజు, టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు పున్న రాజు, కార్యవర్గ సభ్యులు వెంకటస్వామి, ఎల్లయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, రమేశ్, సంపత్, సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రూ.2.97లక్షలు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

సిద్దిపేటకమాన్: పేకాట స్థావరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ ఎస్‌ఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక శివాజీనగర్‌లోని ఓ ఇంట్లో కొంత మంది పేకాట ఆడుతున్నారని పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి ఆదివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2.97లక్షలు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నంగునూరు(సిద్దిపేట): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ముండ్రాయి వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నంగునూరుకు చెందిన కోల రమేశ్‌గౌడ్ తన డ్రైవర్ మసూద్‌తో కలసి సిద్దిపేటకు ఇసుక తరలిస్తున్నారన్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని సీజ్‌చేసి సుమోటోగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

◆ ఆర్పీల సమస్యలను పరిష్కరించండి

గజ్వేల్‌రూరల్: మహిళా సంఘాల సభ్యులను చైతన్యవంతులను చేస్తూ వారు ఆర్థికాభివృద్ధి సాధించడంలో కీలకపాత్ర వహిస్తున్న రీసోర్స్ పర్సన్‌ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్పీల నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా ఎల్లయ్య, అధ్యక్షురాలిగా సుభద్ర, ప్రధాన కార్యదర్శిగా కల్పన తదితరులు ఎంపికయ్యారు. అనంతరం ఎల్లయ్య మాట్లాడుతూ మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలకు జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్పీలపై ప్రభుత్వం చిన్నచూపు తగదని, రూ.19,500 జీతం చెల్లించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి, నాయకులు వెంకటచారి పాల్గొన్నారు.

◆ ‘బహుజన బతుకమ్మ’ పోస్టర్ ఆవిష్కరణ



గజ్వేల్‌రూరల్: బహుజన బతుకమ్మ వేడుకల్లో మహిళా సంఘాల సభ్యులు, రాజకీయ పార్టీల నాయకులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అక్కారం గ్రామానికి చెందిన నవచైతన్య సేవాసమితి, ఆదర్శ యువజన, అంబేడ్కర్ సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. 9న నిర్వహించతలపెట్టిన ఈ బతుకమ్మ ఉత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఆయా యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం ముంగీస్‌పల్లికి చెందిన కొత్త శివ(21) కుటుంబం గజ్వేల్‌లో నివాసం ఉంటుంది. ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై శివ ప్రజ్ఞాపూర్ నుంచి గౌరారం వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు డివైడర్‌పై పడి గాయపడ్డాడు. అతడిని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ప్రమాద ఘటనపై విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ వృత్తి విద్యా కోర్సులపై అవగాహన

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు చదువుతోపాటు వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కల్పిస్తున్నట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వన్నెస్స తెలిపారు. ఆదివారం ఆమె ఒకేషనల్ విద్యార్థినులకు మల్టీ మీడియా, బ్యూటీ పార్లర్ నిర్వహణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వృత్తివిద్యపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్ ఫ్లెక్సీ ప్రింటర్స్ నిర్వాహకులు వెంకట్‌గౌడ్ తదితరులున్నారు.

◆ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

సిద్దిపేటరూరల్: సిద్దిపేట క్రికెట్ స్టేడియంలో ఈనెల 4న ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రికెట్ అండర్ 14 విభాగంలో జరిగిన ఎంపికలో నారాయణరావుపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థి రామ్ చరణ్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగరాజు ఆదివారం తెలిపారు. 14 నుంచి 17వరకు జోగులాంబ గద్వాల జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో రామ్‌చరణ్ పాల్గొంటాడని చెప్పారు.

◆ జూనియర్ అసిస్టెంట్ మృతి

అక్కన్నపేట(హుస్నాబాద్): అనారోగ్యంతో ఓ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందాడు. దూల్మిట్ట మండలం లింగాపురానికి చెందిన వెంకటేశ్(45) నాలుగేళ్లుగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడున్నాడు. ఈ క్రమంలో ఆదివారం లింగపురంలోని ఇంటి వద్ద మృతి చెందాడు. మాజీ ఎంపీపీ లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మాలోతు బీలునాయక్ నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శులు సంజీవ్, అశోక్, తిరుపతి, ప్రభాకర్, శ్రీకాంత్, కార్తీక్, అనూష, సుచరిత తదితరులు ఉన్నారు.

◆ హామీల అమలులో వైఫల్యం

సిద్దిపేటజోన్: కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో వైఫల్యం చెందిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. స్థానిక భారత్ నగర్‌లో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంకటేశ్, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదవ్, కనకరాజు పాల్గొన్నారు.

◆ 9న మండలానికి టార్చ్ ర్యాలీ..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్, తోటపల్లి గ్రామాల వద్ద రాజీవ్ రహదారి గుండా కరీంనగర్ జిల్లాకు వెళ్లే టార్చ్ ర్యాలీకి అధిక సంఖ్యలో అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని మోడల్ స్కూల్ పీడీ కనకారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. క్రీడల అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నవంబరులో సీఎం కప్ నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా వస్తున్న టార్చ్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.